




VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 84 | మంగళవారం 25 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే లేఖ

- అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు కాక్రోచ్ జనతా పార్టీ లేఖ
- విద్యను అత్యవసర ప్రాధాన్యత అంశంగా చూడాలని విజ్ఞప్తి
- ప్రభుత్వ పాఠశాలలపై రాష్ట్రాల వారీగా సమగ్ర డేటా కోరిన సీజేపీ



2

## మోదీ పక్కనే ఉండగా.. ట్రంప్ చేసిన ఆ ఒక్క పని..

## అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు

- భేటీ తర్వాత ఆ విషయం మర్చిపోయిన అమెరికా అధ్యక్షుడు
- భేటీ తర్వాత మీడియా నుంచి ప్రశ్నలు ఆహ్వానించిన ట్రంప్
- ఈ విషయాన్ని వెల్లడించిన అమెరికా రాయబారి సెర్జియో గోర్



2

## రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి..

## గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం



2లో

వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక ఆర్థిక శక్తిగా చూడాలని, రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన 'గౌర్మే పాప్‌కార్నికా' సంస్థ ఒక వినూత్న విప్లవానికి శ్రీకారం చుట్టిందని ఆయన కొనియాడారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి నూజివీడు సమీపంలోని ముసునూరులో జరిగిన గౌర్మే సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, కొత్తరకం పాప్ కార్న్ సీడ్ ను ఆవిష్కరించారు.

# నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే



వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ. ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాల నేదే తమ యోచన అని పేర్కొన్నారు. పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు.

- మిగతా2లో

## ఈగల్ శాఖలో ఇంటి దొంగల బాగోతం.. డ్రగ్స్ పెడ్లర్లతో కలిసి




డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేసే ఈగల్ శాఖలోనే ఇద్దరు కానిస్టేబుల్స్ డ్రగ్స్ దందాకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈగల్ ఇంటి దొంగలైన కానిస్టేబుల్ నరహరి, స్వామిల పై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.50 లక్షలు విలువైన ఎక్స్టసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్న కానిస్టేబుల్స్.. దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వనట్లు తెలుస్తోంది. 50 లక్షల విలువైన ఒక కిలో ఎక్స్టసీ మాత్రలను అక్రమంగా విక్రయించేందుకు వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

- మిగతా2లో

## ఇంటింటికీ తెలుగుదేశం.. 29 రోజుల్లో 81 లక్షల కుటుంబాలు




2

- 80 లక్షల ఇళ్ల మైలురాయిని దాటిన ప్రజాభిప్రాయ సేకరణ
- మొత్తం 81.64 లక్షల కుటుంబాలను కలిసిన టీడీపీ శ్రేణులు
- ప్రభుత్వ పథకాల వివరణ, ప్రజా సమస్యల సేకరణే లక్ష్యం
- కార్యక్రమానికి ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన

## ఫీజు బకాయిల రగడ.. హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బీజేపీ నేత రాంచందర్ రావు దీక్ష
- రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ
- రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం



2

VARTHA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 25 ఆగష్టు 2026

## మోదీ పక్కనే ఉండగా.. ట్రంప్ చేసిన ఆ ఒక్క పని.. అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు

పారిస్ సమీపంలో జరిగిన మోదీ–ట్రంప్ భేటీ ప్రశ్నల పర్వంగా మారడం వెనుక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మీడియా ఉండొచ్చు కానీ ప్రశ్నలు అడగకూడదని భారత్ కోరిందట. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలుత అంగీకరించారట. అయితే సమావేశం ప్రారంభమైన తర్వాత ఆ విషయం మర్చిపోయి స్వయంగా మీడియాను ప్రశ్నలకు ఆహ్వానించారని అమెరికా రాయబారి సెర్జియో గోర్ వెల్లడించారు.

**భారత్ పెట్టిన ఒక్క అభ్యర్థన**

ఫ్రాన్స్‌లో జూన్ 17న జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ట్రంప్ సమావేశమయ్యారు. భేటీకి ముందు అమెరికా విదేశాంగ ప్రతినిధితో భారత విదేశాంగ శాఖ ఓ అభ్యర్థన చేసిందని గోర్ తెలిపారు. మీడియాను అనుమతించవచ్చు కానీ పూర్తి స్థాయి ప్రెస్ కాన్ఫరెన్స్ వద్దన్నదే ఆ అభ్యర్థన అని చెప్పారు. ఈ విషయాన్ని ట్రంప్‌నకు చెప్పగా.. ఎలాంటి ఇబ్బంది లేదని ఆయన అంగీకరించారని గోర్ తెలిపారు.

**'ఎనీ క్వశ్చన్స్?' తో మారిన సీన్**

సమావేశం ప్రారంభమైంది. దాదాపు 50 కెమెరాల మధ్య మోదీ, ట్రంప్ తమ ప్రారంభ ప్రసంగాలు చేశారు. ఆ తర్వాత ట్రంప్ ఒక్కసారిగా మీడియా వైపు తిరిగి.. "ఏమైనా ప్రశ్నలు ఉన్నాయా?" అని అడిగారని గోర్ చెప్పారు. అంతే.. అనుకున్న పరిమిత మీడియా కార్యక్రమం పూర్తి స్థాయి ప్రెస్ కాన్ఫరెన్స్‌గా మారిపోయింది. దాదాపు 45 నిమిషాల పాటు ప్రశ్నల పరంపర సాగిందని తెలిపారు. సమావేశంలోని పలు అంశాలు చర్చకు వచ్చాయని చెప్పారు.

**సముద్ర భద్రత పై మోదీ ప్రస్తావన**

ఈ భేటీకి ముందు హార్మూజ్ జలసంధిలో అమెరికా నౌకాదళ దాడిలో ముగ్గురు భారత నావికులు మరణించారు. దీంతో అక్కడ పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రత అంశాన్ని ట్రంప్ దృష్టికి మోదీ తీసుకెళ్లారు. హార్మూజ్ ప్రాంత పరిస్థితులు, భారత్–అమెరికా వాణిజ్య సంబంధాలపైనా ఇద్దరు నేతలు చర్చించారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగుతున్న సమయంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు దేశాలు ఒప్పందానికి చాలా దగ్గరగా వచ్చాయని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే లేఖ

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) సంస్థ కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ఆ సంస్థ ప్రతినిధి అభిజీత్ దీప్కే, అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు లేఖలు రాశారు. విద్యను అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించాలని ఆయన తన లేఖలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ప్రవేశాలు, ఉపాధ్యాయ ఖాళీలు వంటి కీలక అంశాలకు సంబంధించి రాష్ట్రాల వారీగా సమగ్రమైన, పారదర్శకమైన గణాంకాలను అందజేయాలని అభిజీత్ దీప్కే కోరారు. దేశంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రస్తుత దుస్థితిపై సీజేపీ ఆందోళన వ్యక్తం చేసింది. వివిధ రాష్ట్రాల్లోని పాఠశాలల స్థితిగతులను బేరీజు వేయడానికి, వ్యవస్థలోని లోపాలను గుర్తించి సరిదిద్దడానికి ఈ సమాచారం ఎంతో దోహదపడుతుందని సంస్థ అభిప్రాయపడింది. వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన ఈ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పులు తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టవచ్చని అభిజీత్ దీప్కే తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంపొందించడమే ధ్యేయంగా సీజేపీ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

## నా పై నిఘా పెట్టారు.. సీఎం సోదరుడి పై ఎంపీ అర్వింద్ సంచలన ఆరోపణలు



నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం తెలంగాణ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగంపై సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు, ఒక ఏసీపీ స్థాయి అధికారి తన కదలికల పై నిఘా ఉంచినట్లు ఆయన ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి ఆయన ఒక పోస్ట్ చేశారు. "డీజీపీ సీవీ ఆనంద్ గారూ, మీరు నాకు దశాబ్దాలుగా తెలుసు. మిమ్మల్ని ఎప్పుడూ ఒక సమర్థవంతమైన అధికారిగానే పరిగణించాను. అయితే, ముఖ్యమంత్రి సోదరుడి ఆదేశాల మేరకు ఒక ఏసీపీ స్థాయి అధికారికి నా కదలికలను పర్యవేక్షించే బాధ్యతను అప్పగించినట్లు నా దృష్టికి వచ్చింది" అని అర్వింద్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల పనితీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "తెలంగాణ పోలీసులు రాజ్యాంగానికి, చట్టబద్ధమైన అధికార యంత్రాంగానికి లోబడి పనిచేస్తారా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నడుచుకుంటారా? అనేది ఇక్కడ ఉత్పన్నమవుతున్న ప్రాథమిక ప్రశ్న" అని ఆయన నిలదీశారు. పోలీసులు కేవలం చట్టానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని, ఏ రాజకీయ కుటుంబానికీ కాదని తాను ఆశిస్తున్నట్లు అర్వింద్ స్పష్టం చేశారు.

# నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే

టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు.

**విదేశాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం..**

'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చింది. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారు? గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నాది చాటుమాటు పర్యటన కాదు..**

మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ పై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు.

**తెలంగాణ అంటే చిన్నచూపు..**

కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరంలేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి.. గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి నూజివీడు సమీపంలోని ముసునూరులో జరిగిన గౌర్మే సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, కొత్తరకం పాప్ కార్న్ సీడ్ ను ఆవిష్కరించారు. సంస్థ విజయగాథను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఒకప్పుడు మన దేశంలో అమ్ముడైన ప్రతి పాప్‌కార్న్ గింజపై మనం ఖర్చు చేసిన డబ్బులో 70 శాతానికి పైగా బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాలకు వెళ్లేది. కానీ, గౌర్మే సంస్థ కృషితో ఇప్పుడు ఆ 70 శాతం ఆదాయం మన దేశ రైతులకే దక్కుతోంది. కేవలం 11 ఏళ్లలో ఈ సంస్థ దేశానికి 125 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1000 కోట్లకు పైగా) విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసింది. ఇది మనందరికీ గర్వకారణం" అని ప్రశంసించారు. 2014లో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంగా ఎదగడం, 8 రాష్ట్రాల్లో 17,500 మంది రైతులతో 40,000 ఎకరాల్లో సాగు చేస్తూ దేశంలోని 3,400 సినిమా థియేటర్లకు పాప్‌కార్న్‌ను సరఫరా చేయడం అసాధారణ విజయమని కొనియాడారు. సంస్థ ఎండీ పట్టాభిరామారావు గారి కుటుంబానికి వ్యాపార దక్షత, రైతులను ఆదుకునే వారసత్వం ఉన్నాయని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో విలువ జోడింపు ప్రాధాన్యతను వివరిస్తూ, "ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా, అరటి, మామిడి, మిరప, పసుపు, పామాయిల్ వంటి ఎన్నో వాణిజ్య పంటలు పండుతున్నాయి. అయితే, వాటిని ప్రాసెస్ చేసి, బ్రాండ్ సృష్టించి అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడే రైతు రాజుగా ఎదుగుతాడు. గౌర్మే సంస్థ పొలం నుంచి వినియోగదారుడి వరకు ట్రేసబిలిటీతో ఒక పక్కా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇదే మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర పంటలకు కూడా వర్తింపజేయాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోందని, దీనిని 60–70 శాతానికి పెంచగలిగితే ఉపాధి అవకాశాలు, విదేశీ మారక ద్రవ్యం భారీగా పెరుగుతాయని విశ్లేషించారు. రాష్ట్రంలో నీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో 52 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. అయినప్పటికీ, గతంలో నిర్మించిన పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి రైతులను కొంతవరకు ఆదుకోగలిగాం. నూజివీడు ప్రాంత భవిష్యత్తును మార్చే చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును న్యాయపరమైన అడ్డంకులు తొలగించి త్వరలోనే పూర్తి చేస్తాం. దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఆగస్టు 31న జాతికి అంకితం చేస్తున్నాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీటిని అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. దేశంలోని నదుల అనుసంధానం ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈ ఆశయానికి మద్దతునివ్వడం అభినందనీయమన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం.. 29 రోజుల్లో 81 లక్షల కుటుంబాలు

కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ప్రారంభించిన 'ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం –అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. 29వ రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమం ఇప్పటికే 80 లక్షల ఇళ్ల మైలురాయిని అధిగమించి, ప్రజా మద్దతుతో ముందుకు సాగుతోంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి ప్రత్యక్షంగా అభిప్రాయాలను సేకరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. సోమవారం నాటికి ఈ కార్యక్రమం 29వ రోజు పూర్తి చేసుకుంది. ఒక్కరోజే పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 2,32,568 ఇళ్లను సందర్శించారు.దీంతో కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 81.64 లక్షల కుటుంబాలను టీడీపీ శ్రేణులు నేరుగా కలుసుకున్నాయి. అతి తక్కువ సమయంలోనే 80 లక్షల ఇళ్ల మైలురాయిని దాటడం ఈ కార్యక్రమ వేగానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు ప్రతి గడపకూ వెళ్లి, ప్రభుత్వ పనితీరు పై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్నాయి. రెండేళ్ల కూటమి పాలనలో రైతులు, మహిళలు, యువత, పేద, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొంటుండటం విశేషం. ప్రజా భాగస్వామ్యంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత విస్తృతంగా మారుతోందని పార్టీ వర్గాలు తెలిపాయి.

# ఫీజు బకాయిల రగడ.. హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

**రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్**

రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

# ఈగల్ శాఖలో ఇంటి దొంగల బాగోతం.. డ్రగ్స్ పెడ్లర్లతో కలిసి

50 లక్షల విలువైన ఒక కిలో ఎక్టసీ మాత్రలను అక్రమంగా విక్రయించేందుకు వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఏకంగా డ్రగ్ పెడ్లర్లను సంప్రదించినట్లు సమాచారం. ఒక డ్రగ్ పెడ్లర్‌ను పట్టుకునేందుకు హెచ్‌న్యూ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో.. కానిస్టేబుళు నరహరి, స్వామిల బాగోతం బట్టబయలైంది. గతంలో వీరిద్దరూ పలు విజయవంతమైన యాంటీ డ్రగ్స్ ఆపరేషన్స్ చేసి అవార్డులు కూడా అందుకున్నారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ఈగల్ టీం.. ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి దూరం పెట్టినట్లు తెలుస్తోంది. నరహరి, స్వామిలపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. డ్రగ్స్ పెడ్లర్లతో వీరికి ఉన్న సంబంధాలు, ఎక్టసీ మాత్రలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఈగల్ శాఖలో మరెవరైనా ఇందులో భాగస్వాములై ఉన్నారా అనే కోణంలో ఈగల్ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**వరంగల్‌లో 120 కిలోల గంజాయి పట్టివేత**

వరంగల్ జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. దాదాపు 120 కిలోల గంజాయిని కారులో రవాణా చేస్తున్న ఇద్దరిని వర్ధన్నపేటలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు గంజాయిని ఒడిశా నుంచి కేరళకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని అంచనా.నిందితులు రవాణాకు ఉపయోగించిన కారు త్రిపుర రాష్ట్రానికి చెందినదిగా గుర్తించారు. 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. గంజాయి రవాణాకు ఇంకెవరైనా సహకరించారా అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## 'కాగ్'కు భయపడేదెవరు?




'ప్రజాస్వామ్య వ్యవస్థ లోపాలమయం. అయితే ఇతర పాలనా వ్యవస్థలన్నిటి కంటే అదే ఉత్తమం' అన్నాడు విన్స్టన్ చర్చిల్. ప్రజాస్వామ్య వ్యవస్థను ఎందుకు ఉత్తమమైన పాలనా వ్యవస్థగా పరిగణిస్తామంటే, ఈ వ్యవస్థలో అనేక చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ ఉండడం వల్ల. అయితే ప్రజాస్వామ్యంలోనున్న బ్యాలెన్సింగ్ వ్యవస్థల్ని మన పాలకులు నిర్వీర్యం చేస్తున్నందువల్ల ఉత్తమ ప్రజాస్వామ్య వ్యవస్థ కాస్తా నేడు ఉత్త వ్యవస్థగా మారిపోయింది.మనకున్న అత్యుత్తమ రాజ్యాంగ వ్యవస్థలలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఒకటి. ఇది స్వతంత్రంగా పనిచేసే వ్యవస్థ. కాగ్ ప్రధానంగా మూడు రకాలైన ప్రభుత్వ ఆడిట్లను నిర్వహిస్తుంది. అవి–– ప్రభుత్వాల నిబంధనలు, ఆదేశాలు, సూచనల ఆచరణ, పథకాలు, కార్యక్రమాల అమలు అంచనా, ఫైనాన్షియల్ ఆడిట్ (ప్రభుత్వ ఖాతాలు, ప్రభుత్వరంగ సంస్థల ఖాతాలు). 'కాగ్' ఏటా తన ఆడిట్ నివేదికలను కేంద్ర స్థాయిలో రాష్ట్రపతికి, రాష్ట్ర స్థాయిలో గవర్నర్లకు సమర్పిస్తుంది. ఆ తర్వాత వాటిని పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో ప్రవేశపెడతారు. ఈ ఆడిట్‌లను ప్రవేశపెట్టిన తర్వాత అవి బహిరంగ పత్రాలవుతాయి. కనుక వాటిపై ఎవరైనా చర్చ చేయొచ్చు. 'కాగ్' ఒక సలహా సంస్థ మాత్రమే. తన నివేదికలను అమలు చేయాలని శాసించే అధికారం కాగ్‌కు లేదు. అయితే కాగ్ నివేదికలను ప్రభుత్వం అధికార ప్రతిపక్ష పార్టీలతో కూడిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(ౄూజ)కి పంపుతుంది. పీఏసీ ఆ నివేదికలను వివరంగా సమీక్షించాల్సి ఉంటుంది. 'కాగ్' లేవనెత్తిన అంశాలపై వివరణలు కోరుతూ ఆయా లోపాలపై ప్రభుత్వం విచారణలకు ఆదేశిస్తుంది. అంతేకాదు, తాము చేసిన సిఫార్సులపై తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదికలు (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) ఇవ్వాలని ప్రభుత్వాన్ని పీఏసీ కోరుతుంది. ఈ మొత్తం ప్రక్రియ వల్ల పన్ను కట్టే ప్రజల సొమ్ము ఏ విధంగా ఖర్చు అవుతున్నదో అందరికీ తెలుస్తుంది. అలాగే ఏయే ప్రభుత్వ పథకాల్లో లోపాలు జరిగాయో, అవినీతి ఎక్కడ ఉన్నదో తెలుస్తుంది. లోపాలు, అవినీతి ఆడిట్‌లో తేలిన తర్వాత వాటిని దర్యాప్తు సంస్థలకు నివేదించి బాధ్యుల్ని గుర్తించి వారిపై కేసులు పెడతారు. 'కాగ్' ఆడిట్ నివేదికల ఆధారంగానే 2011లో 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల కుంభకోణం, 2013లో బొగ్గు క్షేత్రాల కేటాయింపు కుంభకోణం బయటపడ్డాయి. 'కాగ్' నిర్వహించే పోస్టుమార్టంలో ఇలాంటి అక్రమాలు ఎన్నో బయటపడడానికి ఆస్కారం ఉంది. అయితే, మన పాలకులు అన్ని రాజ్యాంగ వ్యవస్థల్ని బలహీనపరుస్తున్న విధంగానే 'కాగ్' నివేదికలను చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు. ఒకప్పుడు పార్లమెంట్, అసెంబ్లీల బడ్జెట్ సమావేశాలు జరిగే సమయంలో 'కాగ్' నివేదికలను ప్రవేశపెట్టేవారు. ప్రతిపక్ష పార్టీలు అందులోని అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేవి. అక్రమాలపై దర్యాప్తు చేయిస్తామని అధికార పార్టీ హామీ ఇచ్చేవరకు ప్రతిపక్షాలు పోరాడేవి. 'కాగ్' ఆడిటింగ్ ప్రామాణికం కనుక ప్రభుత్వం తప్పనిసరిగా అక్రమాలపై చర్యలు చేపట్టేందుకు సుముఖత చూపేది. కానీ నేటి పాలకులు వ్యవస్థల్లో ఉన్న లొసుగుల్ని ఆధారం చేసుకుని తప్పించుకోవాలని చూస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 151 ప్రకారం 'కాగ్' నివేదికలను శాసనసభల ముందు ఉంచడానికి ఎటువంటి కాలపరిమితి లేదు. కనుక పలు రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ సమావేశాల చివరిరోజున మొక్కుబడిగా 'కాగ్' నివేదికలను ప్రవేశపెడుతున్నాయి. ఆ నివేదికలలో ఏమున్నదో సభ్యులు, మీడియా, ప్రజలు తెలుసుకునేలోపు శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడతాయి. దాంతో, అసెంబ్లీలో 'కాగ్' నివేదికలపై చర్చ జరగడం లేదు. గతంలో ఢిల్లీ ప్రభుత్వం 'కాగ్' నివేదికలను నాలుగేళ్ల పాటు తొక్కిపెట్టింది. పశ్చిమ బెంగాల్‌లో కూడా ఇటువంటి అసాధారణ జాప్యం జరిగింది. 'కాగ్'కు ఉన్న సహజ పరిమితులలో అది నేరుగా ప్రైవేటు సంస్థలను ఆడిట్ చేయలేదు. అంతేకాదు, పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ)లో చేపట్టే పనులను కూడా ఆడిట్ చేయలేదు. ప్రస్తుతం, దాదాపుగా అన్ని రకాల భారీ ప్రాజెక్టులూ ప్రైవేటు భాగస్వామ్యంతో చేపడుతున్న నేపథ్యంలో సదరు ప్రాజెక్టుల్లో జరుగుతున్న అవకతవకలు, అవినీతిని ఎవరూ బయటపెట్టలేని పరిస్థితి ఉన్నది. కాబట్టి 'కాగ్' పరిధిని ప్రభుత్వ భాగస్వామ్యంతో కలిసి పనిచేసే ప్రైవేటు సంస్థలకూ విస్తరించాల్సిన అవసరం ఉంది. కానీ, ఈ దిశగా నిర్ణయం తీసుకోవడానికి ఎవ్వరూ సిద్ధంగా లేరు. అలాగే 'కాగ్' నివేదికలను నిర్ణీత కాలవ్యవధిలో చట్టసభలలో ప్రవేశపెట్టాలన్న నిబంధన విధించాలని కోరడానికి కూడా ఏ రాజకీయ పార్టీ కూడా చొరవ తీసుకోవటం లేదు.కాగ్' ఆడిటింగ్ నివేదికలలో మరో కీలకమైన పార్శ్వం కేంద్ర, రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై అది అందించే వాస్తవాలు. ఇవి ప్రభుత్వాల పరిపాలనా సామర్థ్యానికి కొలమానంగా నిలుస్తాయి. కాగ్ వెల్లడించిన కొన్ని ఆర్థిక అంశాలు పరిశీలించినప్పుడు మన దేశం, కొన్ని రాష్ట్రాలు ఏ దిశగా పయనిస్తున్నాయో అర్థం అవుతున్నది.

# ఇప్పటికీ అంతే కొత్త పాళీ!

తాపీ ధర్మారావు తన జీవితంలో ఒక మూడేళ్ళపాటు ఒక్క ముక్క రాయలేదు. ఆ కాలం గురించి ఆయన ఇలా రాసారు: "...పూర్వపు రీతినే వ్రాసివేద్దామంటే, నా హృదయంలో కలిగిన మార్పు దానికి ఒప్పుకునేది కాదు. అందుచేత మౌనం కలిగింది నా కలానికి. దీనివల్ల స్నేహితులయిన పత్రికా సంపాదకులకి నాపై కోపం కూడా కలిగింది ఏమి చేయను? నాపై నాకే కోపం కలిగినపుడు ఇతరులకి కలగదా!..."1933 నుంచి 1936 మధ్య ఆ మూడేళ్ళ కాలంలోనూ చేసినదేమిటో కూడా ఆయన రాసుకున్నారు: "మూడు సంవత్సరాలు––వెయ్యిరోజులు––దాటిపోయాయి. ఒక్క ముక్క అయినా వ్రాయలేదు... ప్రచురించడం అంతకన్నా లేదు. నిజమే, కాని, చదివినది మాత్రం చాలా ఉంది. దగ్గరదగ్గర 40, 50 వేల పేజీల సారస్వతం చదవగలిగాను. సారస్వతం అంటే ఎలాంటి సారస్వతం? ...దేశదేశాలలోనూ, ఖండఖండాలలోనూ ప్రఖ్యాతి పొందిన గ్రంథాలు. వందలకొద్ది ఇతర భాషలలోకి తర్జుమా అయిన గ్రంథాలు, అన్ని జాతులవాళ్ళ పొగడ్తల్నీ, లక్షలకొద్దీ బహుమానాన్నీ పొందిన గ్రంథాలు. ప్రపంచంలోని జనులనీ, వాళ్ళ అభిప్రాయాలనీ ఒక్కసారి మార్చివేసిన గ్రంథాలు. రషియా, జర్మనీ, నార్వే, స్వీడను, ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా... ఈ దేశాలలో మిక్కిలి ఉత్తమమైన గ్రంథాలు. ఈ గ్రంథాలు కరువుదీర చదివాను. నా స్వభావాన్నిబట్టి చదివిన వాటిని గురించి విమర్శించుకున్నాను. ఆలోచించుకున్నాను. తరువాత ఆయా దేశాల్లో ఆ గ్రంథాలను గురించి విమర్శనలు చూశాను. నోబెల్ మొదలైన గొప్ప గొప్ప బహుమానాలు ఈ గ్రంథాలకెందుకిచ్చారో తెలుసుకున్నాను. దీని అంతటివల్ల నా అభిప్రాయాలు చాలా ఎక్కువగా మారిపోయాయి. మారక తప్పదు ఆ గ్రంథాలని చూచిన తర్వాత." ఈ మాటలన్నీ తాపీ ధర్మారావు పుస్తకం 'కొత్తపాళీ'లోని తొలి పేరాలు. రాయకుండా గడిపిన మూడేళ్ళ తర్వాత గూడవల్లి రామబ్రహ్మం నడిపిన 'ప్రజామిత్ర' పత్రికలో 1936 సంక్రాంతి సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురింపబడిన ధర్మారావు వ్యాసాలే 'కొత్తపాళీ' సంపుటి. అప్పటికి ధర్మారావు వయసు నలభైకు మించలేదు. ఆయన్ను వ్యావహారిక భాషా వైతాళికుడిగా మనం కొనియాడుతాం. ఘనమైన పత్రికా సంపాదకుడిగా గౌరవిస్తాం, తెలుగు సినిమాలకు చక్కని భాషను, స్క్రీన్ ప్లే విధానాన్ని ఇచ్చిన దార్శనికుడిగా కీర్తిస్తాం. అయితే తెలుగు సాహిత్య విమర్శకుడిగానూ ఆయన పేరు గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉంది. ఇటీవల మళ్ళీ వారి రచనలు 'ఇనుప కచ్చడాలు', 'దేవాల యాలపై బూతు బొమ్మలు', 'సాహిత్య మొర్మరాలు', 'పాత పాళీ', 'కొత్తపాళీ' పుస్తకాలను జాగ్రత్తగా చదివాను. సాహిత్య విమర్శను కూడా బొరుగులు తిన్నంత సులువుగా అందివ్వగలిగిన ప్రతిభాశాలి తాపీ. 'కొత్తపాళీ' గురించి చాలామంది రాశారు, శ్లాఘించారు, తాపీవారికి పర్యాయపదంగా వాడారు. అయినా ఇప్పటికీ తెలుగు పాఠకులు 'కొత్తపాళీ'ని కొత్తగా, సమగ్రంగా, సవ్యంగా చూడాల్సి ఉందనే అనిపిస్తోంది.నిజానికి తాపీధర్మారావు 'కొత్తపాళీ' ద్వారా సాహిత్యరచనకు ఒక సిలబస్ రూపొందించారు.ఏది సాహిత్యం? ఎవరి కోసం ఆ సాహిత్యం? దాని ఉద్దేశ్యం ఏమిటి? ఎలా రాయాలి? అలానే ఎందుకు రాయాలి? –– అనే విషయాలపట్ల సమగ్రమైన అవగాహన కలిగిస్తారు. అలాగే కవి లేదా రచయిత నిల్చున్న కాలానికీ, సమయానికీ –– గతాన్నీ, గత సాహిత్యాన్ని ఎలా చూడాలి? ఏమి స్వీకరించాలి? అలాగే భవిష్యత్తులో బాధ్యత ఏమిటి? అని కూడా చాలా సులువుగా బోధపడేట్టు విశ్లేషిస్తారు.సాహిత్య విమర్శకుడిగా ధర్మారావులో పాండిత్యం, విశ్లేషణ, ఓపిక విశేషంగా ఉన్నాయి. అంతకుమించి వారి విమర్శలో మనం చూడాల్సినవి మరిన్ని ఉన్నాయి:అ) సాహిత్య విమర్శను రీడబుల్‌గా రాయడమూ, ఆ) హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, వెటకారాన్ని పుష్కలంగా వాడటమూ, ఇ) ఎటువంటి ద్వేషం లేకుండా సహనం, సమన్వయంతో కూడిన దృష్టితో సాహిత్య పరిశీలన చేయడమూ, ఈ) హేతుబద్ధంగా ఏది ప్రయోజనకరమో, కాదో అని విశ్లేషించి చూపడమూ, ఉ) తెలుగునూ, తెలుగు సాహిత్యాన్ని నెత్తిన పెట్టుకు అవి మరింత ఉజ్జ్వలంగా ఉండాలనడమూ –– వెరసి నవనవోన్మేషంగా తెలుగు సాహిత్య విమర్శకు కొత్తచూపు ఇవ్వడమూ.ఈ వ్యాసాలను 1955లో పుస్తకంగా వెలువరిస్తూ ఇలా అన్నారు: "...నాకు సంస్కృతం మీద ద్వేషమని కొందరయ్యలంటూంటారు. కాదు: నాకు కావాలి సంస్కృతం, కొద్దో గొప్పో ఇప్పటికీ చదువుకుంటుంటాను. అది గొప్ప రత్నాల గని. నిజమే. ఇష్టమున్నవాళ్ళు సంస్కృతం చదవవలసిందే, దానిలో ఉన్న విజ్ఞానం తెలుసుకోవలసిందే, ఆ విజ్ఞానాన్ని తెలుగులోనికి తీసుకురావలసిందే. అది కూడదనను. అనవసరంగా ఆ భాషను దిగుమతి చేయకండంటాను. తెలుగుతనం నిలుపమంటాను. అంతే.. ."అలాగే కొత్తపాళీ చివరి వ్యాసం చివరలో ఇలా అంటారు: "...సాహిత్యాన్ని పట్టి ఆ జాతి వారి విజ్ఞానము, జీవన విధానము, ఆచారాలు, సంస్కృతి తెలుసుకోవడానికి వీలుండాలి. సాహిత్యంలో జాతి కనబడాలి. జాతికి సాహిత్యం అద్దంలాగుండాలి.""తెలుగు కవి, తెలుగు రచయిత, తెలుగు ప్రజల జీవితంలో ఉండి వ్రాయాలి... తెలుగు సంస్కృతీ, తెలుగు గడ్డా, యుగయుగాల నుంచి వచ్చిన తెలుగు విజ్ఞానమూ తనకిచ్చిన శక్తీ, అతను తెలుగు ప్రజకి రుణపడి ఉన్నాడు. ఆ రుణం తీర్చాలి; తన ఇష్టం వచ్చినట్టు వినియోగించుకోకూడదు. మళ్ళీ తెలుగువాళ్ళకు తాను కొంత చెల్లించాలి," అని కూడా చెప్తారు తాతాజీ.ఈ క్లారిటి చూడండి: "...అందులో సంస్కృతమే ఉండనీయండి, తెలుగే ఉండనియ్యండి, ఇంగ్లీషు, హిందూస్తానీ మరేదయినా ఉండనీయండి. ఏమైనాసరే తెలియడం ప్రధానం..." అంటారు. 1936లో రాసిన మాటలు నేటికీ చాలామందికి ఎంతో అవసరమనిపిస్తుంటుంది –– కొన్ని సమయాలలో వినిపించే వాదనల రొద వింటూంటే!








**–వారి 'కొత్తపాళీ' వ్యాసాల నుంచి కొన్ని పదునైన వాక్యాలు, పరిశీలనలు:**

1) తెనుగు చేస్తానని చెప్పి, మరింత సంస్కృతం గుప్పి తెలియకుండా చేయడం అక్రమం, తన పాండిత్యం ప్రదర్శించడానికే వ్రాసుకొనడమే అంటుంది మొల్ల–– నన్నయ గురించి.

2) జాను తెలుగు కోసమూ, ద్విపదల కోసమూ, తెలుగు ప్రజల గాథల కోసమూ చూచేవాళ్ళు కొంతమంది ఉండేవాళ్ళు –– నన్నెచోడుడు, పాలకురికి సోమనాథుడు మొదలైన వాళ్ళు. వీళ్ళ పేర్లే మొన్న మొన్నటిదాకా మనకు తెలియకుండా పోయాయి.

3) కవిసమయాలన్నారు, సాహిత్యసూత్రాలన్నారు, కావ్యమర్యాదలన్నారు, నాటకలక్షణాలన్నారు, వెయ్యిపేర్లు చెప్పారు. పదివేల నియమాలు దింపారు... ఇవన్నీ సంస్కృతం రేవులో నుంచే దిగుమతి.

4) పగలు కలువపువ్వులు వికసించి ఉండటం ఎంతమంది చూచారు కాదు? అవి కలువలు కావంటారా?

5) తెలుగులో తెలుగు సాహిత్యాన్ని చూపాలి. సంస్కృతం పరిచయం వల్ల మరింత అభివృద్ధి పొందడానికి బుద్ధిపుట్టాలి. గాని బానిస బుద్ధి పుట్టిపోకూడదు.

6) కృష్ణరాయ చక్రవర్తినీ, ఆతని ఆముక్తమాల్యదా చూడండి. ఆ ఊహాచాతురీ ఆ ప్రపంచ పర్యావలోకనమూ, ఆ కవిత్వదృష్టీ చూచినవాళ్ళకి అతడు గ్రుడ్డి వ్రాతగాడు కాక, ఒక నూరు కళ్ళున్న వ్రాతగాడిలా కనిపిస్తాడే!

7) పేరుగాంచిన ప్రబంధాలని మనం కొంచెం జాగ్రత్తగా చూడాలి. వాటిని కేవలం పారవేయకూడదు. అలా పారవేసినట్టయితే ఆంధ్రసారస్వత జీవనంలో మూడు, నాలుగు వందల సంవత్సరాలు వ్యర్థమయిపోయినట్టే అవుతుంది. అంత నష్టానికి ఎవరు ఒప్పుకోగలరు?

8) గ్రంథాలలో స్త్రీ పురుష సాంగత్య విషయంలోని సంగతులన్నీ మడికట్టుకుని విడిచిపెడితే బాగుండదు.

9) వేడివేడినెత్తురుతో జీవయాత్ర సాగిస్తూ ఉన్న తెలుగు ప్రజలకి మనసాహిత్యంలో జాగా లేకపోయింది. జావా, సుమత్రా ద్వీపాలకి వెళ్ళి వలసలు ఏర్పాటు చేసే చేవగలిగిన తెలుగు తనానికి జాగా లేకపోయింది. పడవలు కడుతూ, సముద్రాలు దాటిన తెలుగు సాహసానికి జాగా లేకపోయింది. ఇంతెందుకు, బ్రతికి ఉన్న తెలుగుకు జాగా లేకపోయింది.

ఎనభైయ్యేళ్ళ క్రితం రాసిన 'కొత్తపాళీ' సాహిత్య విమర్శలో సహనం, సమన్వయం, హేతుబద్ధత, తార్కికత, తెలుగు మీద మనకుండాల్సిన గురి –– మరీ ముఖ్యంగా హాయిగా, అలవోకగా చదివేలా రాయగలగడం –– వంటి కోణాలలో నేటికీ మనకు అవసరం.

# రాజ్యాంగబద్ధంగా ఐదు ఆర్థికహక్కులు

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నది ఒక ప్రధాన చర్చగా మారింది. ప్రతిపక్షాలు తమ ఆరోపణలకు రుజువుగా–– సుప్రీంకోర్టు కొన్ని కేసుల విషయంలో ఇస్తున్న తీర్పులను, ఎలక్షన్ కమిషన్ వ్యవహారశైలిని, విపక్ష నేతలపై ఈడీ చేస్తున్న దాడులను పేర్కొంటున్నాయి. అయితే రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని వీటికి పరిమితం చేస్తే అది పాక్షికమే. రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో వ్యక్తమవుతున్న నిర్లక్ష్యాన్ని, దానికి గల కారణాలను పరిశీలించకపోతే రాజ్యాంగంపై దాడి సమగ్రంగా అర్థం కాదు.'జనవరి 26, 1950 నుంచి మనం వైరుధ్యభరితమైన సమాజంలోకి అడుగుపెట్టబోతున్నాం" అని రాజ్యాంగసభలో అంబేద్కర్ హెచ్చరించారు. "మన సామాజిక, ఆర్థిక జీవనంలో ఎన్నో వ్యత్యాసాలు, అసమానతలు ఉన్నాయి. ఈ అసమానతల కారణంగా ఒక వ్యక్తి–– ఒక ఓటు–– ఒకే విలువ అనే సూత్రం నిరాకరించబడుతున్నది. ఈ విలువను ఇలాగే చాలాకాలంపాటు నిరాకరిస్తూపోతే మనం కష్టపడి తెచ్చుకున్న రాజకీయ ప్రజాస్వామ్యాన్ని చేజేతులా ప్రమాదంలో పడవేసుకున్నట్టే" అని ఆయన అన్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే అంబేద్కర్ చెప్పినట్టుగా తరతరాలుగా కొనసాగుతున్న అసమానతలను తొలగించాలి. రాజ్యాంగ ఆశయం కూడా ఇదే.దఅందుకే రాజ్యాంగంలోని పీఠిక ప్రతి పౌరుడికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని హామీ ఇస్తూ హోదాలోనూ అవకాశాల్లోనూ సమానత్వాన్ని లక్ష్యంగా ప్రకటించింది. అంటే సామాజిక న్యాయాన్ని రాజ్యాంగపు మౌలిక లక్ష్యంగా ప్రకటించింది. ఈ మౌలిక లక్ష్యంలో భాగంగా ప్రతి పౌరుడూ గౌరవంగా జీవించాలని ఆర్టికల్ 21 ప్రతిపాదిస్తున్నది. ప్రజల శ్రేయస్సును పెంపొందించేందుకు సామాజిక వ్యవస్థను మార్చాలని; వ్యక్తుల మధ్య, వర్గాల మధ్య ఆదాయ అసమానతలను తగ్గించడానికి ప్రయత్నించాలనీ ఆర్టికల్ 38(1), (2) చెబుతున్నాయి. అక్కడే ఆగకుండా ఇంకా ముందుకువెళ్లి సహజ వనరులపై యాజమాన్యం, నియంత్రణ ప్రజలకు కలిగించాలనీ సంపద, ఉత్పత్తి సాధనాలను వికేంద్రీకరించేలా ఆర్థిక వ్యవస్థను నిర్వహించాలనీ ఆర్టికల్ 39(బి), (సి) ఆదేశిస్తున్నాయి. ఈ రకంగా పౌరుల మధ్య అసమానతలు లేని సమాజాన్ని అవి నిర్దేశిస్తున్నాయి. అందుకేఈ రాజ్యాంగ అవతరణతో దీర్ఘకాలిక విప్లవం ప్రారంభమైందని మార్క్సిస్టు ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ పేర్కొన్నాడు. నిజమే, రాజ్యాంగం కంటే ముందునాటి సమాజంతో పోల్చినప్పుడు ఈ రాజ్యాంగం విప్లవ స్వభావాన్ని కలిగి ఉన్నదనటంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఆచరణలో జరిగిందేమిటి?ఏం జరిగిందంటే–– టాటా––బిర్లా ప్లాన్ అమల్లోకి వచ్చింది. రాజ్యాంగం ఆదేశించిన దానికి వ్యతిరేకమైన పరిస్థితులు ఉనికిలోకి వచ్చాయి. 1960లోనే ప్రణాళిక విధానం ద్వారా పోగుపడిన సంపద ఎవరిపరమైనదన్న ప్రశ్న ఎదురయింది. ఇందుకు ప్రొఫెసర్ పీసీ మహలనోబీస్ అధ్యక్షతన ఒక కమిటీ వేశారు. భారతదేశంలో ఇంత వరకు అమలైన ప్రణాళికలు ప్రైవేటు పెట్టుబడికి, మరీ ముఖ్యంగా అందులో భారీ ప్రైవేటు పెట్టుబడిదారుల అభివృద్ధికి దోహదపడ్డాయని, అందువల్ల సంపద కేంద్రీకరణ పెరిగిందని ఆ కమిటీ తేల్చింది. దీన్ని నిరోధించాలని ఎమ్‌ఆర్‌టీపీ చట్టాన్ని 1970లో తీసుకువచ్చారు. అయినప్పటికీ ఆ చట్టం పారిశ్రామిక కుటుంబాల దగ్గర సంపద పోగుపడే విధానాన్ని నిరోధించలేక, చిత్తుకాగితంగా మిగిలిపోయింది.



VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 25 ఆగష్టు 2026

# ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి




ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, సుండిపెంట



ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, సుండిపెంట

-గిరిజన విద్యార్థులను పట్టించుకోని అధికారులు
-సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు లేక గిరిజన విద్యార్థులకు అందని ద్రాక్షగా విద్య
-గిరిజన విద్యార్థులకు చదువు అవసరం లేదా!
-2.వతరగతి నుంచి 9 వరకు తరగతులు,సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యార్థుల అవస్థలు
-ఆశ్రమ పాఠశాలల గురించి పట్టించుకోని తాత్కాలిక సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని వెంటనే బదిలీ చేయాలి
-రెగ్యులర్ అధికారిని నియమించాలి
-వెంటనే సబ్జెక్టు వారిగా ఉపాధ్యాయులను నియమించాలని
-గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు జవహర్ నాయక్ డిమాండ్

ఆత్మకూరు ఆగస్టు 24 వార్త సాక్ష్యం

శ్రీశైలం నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్య ముందుకు సాగటం లేదని, రెగ్యులర్ అధికారి లేక,అధికారుల నిర్లక్ష్యం పర్యవేక్షణ లోపం వల్ల గిరిజన విద్యార్థులకు విద్య అందటం లేదని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు జవహర్ నాయక్ అధికారులను కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సుండిపెంట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రెడవ తరగతి నుంచి 9వ తరగతి వరకు 75 మంది విద్యార్థులు ఉన్నారని,ఐతే ఒక ఉపాధ్యాయురాలు, ప్రధానోపా ధ్యాయురాలు బాధ్యతలు మరియు వార్డెన్ బాధ్యతలు చూడాలి. ఒక తెలుగు ఉపాధ్యాయుడు మాత్రమే బోధిస్తున్నాడని, సబ్జెక్టు వారిగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. హిందీ, ఇంగ్లీష్, లెక్కల్, సాంఘిక శాస్త్రము, జీవశాస్త్రము సబ్జెక్టులు వారీగా ఉపాధ్యాయులను నియమించాలని, శివపురం చెంచుగూడెం లోని ఆశ్రమ పాఠశాలలో మొత్తం 92 మంది విద్యార్థులు ఉన్నారని సాంఘిక శాస్త్రము బోధించడానికి ఉపాధ్యాయులు లేరని, విద్యార్థులు వాపోతున్నారు. పాలెం చెరువు చెంచుగూడెం లోని ఆశ్రమ పాఠశాల లో మొత్తం 160 మంది విద్యార్థులు ఉన్నారని, తెలుగు బోధించ డానికి ఉపాధ్యాయులు లేరని, చెంచు గిరిజన విద్యార్థులకు అందని ద్రాక్షగా విద్య మారిం దని, చెంచు గిరిజన విద్యార్థులకు విద్య అవసరం లేదా? చెంచు గిరిజన విద్యార్థుల విద్య గురించి అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో సమాధా నం చెప్పాలని, ఆశ్రమ పాఠశాలల గురించి పట్టించు కోని ఆ అధికారిని వెంటనే బదిలీ చేయాలని, రెగ్యుల ర్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని నియమించాలని, ఆశ్రమ పాఠశాలల్లో సబ్జెక్టు వారిగా ఉపాధ్యాయులను నియమించాలని ఆయన కోరారు.

# రాయలసీమ రైతాంగానికి సాగునీరు అందించే వరకు వైసిపి పోరాటం ఆగదు

-పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దగ్గర వైసిపి నేతల ధ్వజం
-పోలీసుల అడ్డుకున్న వైసిపి ఉద్యమం ఆగదు
-చంద్రబాబును ఎండగట్టిన వైసిపి నేతలు.
-సీమ వైసిపి నేతల డిమాండ్

నంద్యాల ఆగస్టు 24 వార్త సాక్ష్యం

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల ముఖ ద్వారమైన పోతిరెడ్డిపాడు సందర్శనకు వచ్చిన వైసీపీ నేతలను అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు.దీంతో రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన వైసీపీ నేతలు పోతిరెడ్డిపాడు సమీపంలో చంద్రబాబు ప్రభుత్వ పాలనను ఎండగట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని రాయలసీమ రైతాంగం పై ఆయనకు ఏమాత్రం ప్రేమ లేదని వైసీపీ నేతలు ఆరోపించారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యుత్ ఉత్పత్తి పేరుతో ప్రతిరోజు మూడు టీఎంసీల నీరును తెలంగాణకు తరలించకపోతే చంద్రబాబు మాత్రం పోతిరెడ్డిపాడు ద్వారా సీమ ప్రాజెక్టులకు నీరు అందించకుండా పైశాచిక ఆనందం పొందుతున్నారని వైసీపీ నేతలు దుయ్య బట్టారు. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం చేరుతున్నప్పటికీ నీటి విడుదలకు మాత్రం కూటమి పెద్దలు ఆటంకం కలిగిస్తున్నారని వైసీపీ నేతలు పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు సందర్శనకు వచ్చిన వైసిపి బృందాన్ని, రైతులను పోలీసులు రౌడీలా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోతిరెడ్డిపాడు నుంచి ప్రతిరోజు 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి తీమా రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు రామ సుబ్బారెడ్డి, ఇసాక్ భాషా, మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుడ్డా శేషారెడ్డి తదితరులు పెద్ద ఎత్తున ప్రాజెక్టు వద్దకు చేరుకునే ప్రయత్నం చేశారు.



# పోతిరెడ్డిపాడు సందర్శనకు వైఎస్సార్సీపీ నేతలను అడ్డుకోవడం దుర్మార్గం





-నియోజకవర్గశీ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ఆత్మకూరు ఆగస్టు 24 వార్త సాక్ష్యం

పోతిరెడ్డిపాడు వద్ద నీటి పరిస్థితిని పరిశీలించేందుకు, ప్రాజెక్టు సామర్థ్యాన్ని ఎందుకు పూర్తిగా వినియోగి ంచుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వెళు ్తన్న వైఎస్సార్సీపీ నేతలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిశీలించేందుకు వెళ్తున్న నాయ కులను అడ్డుకోవడానికి ఇంత భారీగా పోలీసులను మోహరించడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. తుంగభద్ర, శ్రీశైలం జలాల్లో రాయలసీమకు దక్కాల్సిన వాటాను పూర్తిగా వినియోగించుకోవాలని, ఎస్ఆర్బీసీకి నీటిని విడుదల చేసి రిజర్వాయర్లను నింపి రైతులకు కనీసం ఒక పంటకైనా సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లను తొలగించడం, వారిని బెదిరించడం వంటి చర్యలను వెంటనే నిలిపివే యాలని పోలీసు శాఖను, కోరారు. రాయల సీమకు జరుగుతున్న అన్యాయంపై రైతుల్లో చైతన్యం తీసుకొ చ్చేందుకు సమావేశాలు నిర్వహిస్తామని,




అవసరమైతే అన్ని వర్గాల నాయకులను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని శిల్పా చక్రపాణి రెడ్డి స్పష్టం చేశారు.రాయలసీమకు రావాల్సిన నీటి హక్కులను సాధించే వరకు తమ పోరాటం ఆగదని ఆయన తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలి: సంయుక్త కలెక్టర్ సంజనా సింహా

నరసరావుపేట,ఆగస్టు 24వార్త సాక్ష్యం

దూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలని సంయుక్త కలెక్టర్ సంజనా సింహా ఆదేశిం చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంపై ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం సేకరిస్తు న్నందున అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. భూముల సవరణలు, 22-ఏ అంశాలపై అధికంగా అర్జీలు వస్తున్న నేపథ్యంలో వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



## మార్పులు లేని స్పెషల్ టెట్ ఉపాధ్యాయులకు నిరాశ

ఆత్మకూరు ఆగస్టు 24 వార్త సాక్ష్యం




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎంతో ఆశగా ఎదురుచూసిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం విడుదల చేసిన స్పెషల్ టెట్ నోటిఫికేషన్ కు సంబంధించిన మార్గదర్శకాలలో ఎటువంటి మార్పు లేకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం ఉపాధ్యాయులకు నిరాశకు గురిచేసిందని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎం ఎస్ . ఉమ్మర్ , సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.. ఏపీటీఎఫ్ తరపున స్పెషల్ టెట్ అర్హత మార్కులు 40 శాతంగా, మరియు సబ్జెక్టుల్లో వారిగా సిలబస్ లో మార్పులు గురించి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తూ, సంఘాలు ప్రాతినిధ్యం చేసిన ఎటువంటి సవరణలు చేయకుండా స్పెషల్ టెట్ నిర్వహించడం చాలా బాధాకరం కావున సంఘాల సలహాల సూచనల మేరకు నోటిఫికేషన్ సవరణలు చేయాలని కోరుచున్నాము లేని పక్షంలో ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ,రాష్ట్ర స్థాయిలలో పోరాటం చేయవలసి ఉందని పిలుపునిచ్చారు.

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రజా ధర్బార్ కు విశేష స్పందన

-మీ సమస్య నా సమస్య గా భావించి పరిస్కారం చూపుతా



నంద్యాల ఆగస్టు 24 వార్త సాక్ష్యం

పట్టణంలోని బొమ్మలసత్రం లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో సోమవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ప్రజా ధర్బార్ నిర్వహించారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోనీ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తమ సమస్యలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి విన్నవించుకునేందుకు అధిక సంఖ్యలో నంద్యాల ఎంపీ ఆఫీస్ కు తరలిరావడంతో ఆఫీస్ అర్జీదారులతో కిటకిటలాడింది. ఎక్కువ రెవిన్యూ భూముల సమస్యలు వినతి పత్రం ద్వారా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఇవ్వగా ఆయా మండల తహసీల్దార్లకు పంపి త్వరగా పరిష్కరించాలని కోరారు. వివిధ శాఖల వినతులు కూడా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వారికి పంపారు. కొన్ని వినతులు ఫోన్ ద్వారా ఆయా శాఖల అధికారులకు వివరించి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు కూడా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి వినతి పత్రం ద్వారా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మీ సమస్య నా సమస్య గా భావించి మీ వినతి పత్రాలకు ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కారం చూపుతానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అర్జీదారులకు భరోసా ఇచ్చారు.

## ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

-బాధిత కుటుంబాలకు పరామర్శ...

బాపట్ల, ఆగస్టు 24వార్త సాక్ష్యం:



బాపట్ల నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు పాల్గొన్నారు. బాపట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డు, గాయత్రి అపార్ట్మెంట్ సందులో నిర్వహించిన భగవాన్ శ్రీశ్రీశ్రీ గోలగమూడి వెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బాపట్ల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థిం చారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్ర మంలో పాల్గొని స్వయంగా అన్నవితరణ చేశారు. కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన పార్టీ అధ్యక్షుడు దామర్ల సూర్యనారాయణ అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. ఇదే గ్రామానికి చెందిన కేసాని శ్రీనివాసరావు ఇటీవల వ్యవసా య పొలంలో పాముకాటుకు గురై మృతి చెందగా, ఆయన పెద్దకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సాను భూతి తెలిపారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న దామర్ల సాంబయ్యను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 25 ఆగష్టు 2026

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

-నంద్యాల నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి ఫరూక్, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సమగ్ర చర్చ



నంద్యాల ఆగస్టు 24 వార్త సాక్ష్యం

నంద్యాల పట్టణంలోని మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా నంద్యాల నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి ఫరూక్, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిలు విస్తృతంగా చర్చించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రజలకు సంక్షేమ ఫలాలు వేగంగా చేరేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకు సాగాలని వారు నిర్ణయించారు. నియోజకవర్గ ప్రగతికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.

## జలధార -జలహారతి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చెయ్యాలి

-పనులలో పురోగతిని పెంచాలి
-జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

నంద్యాల, ఆగస్టు 24 వార్త సాక్ష్యం



జలధార- జల హారతి పనులను వేగవంతంగా ప్రారంభించి, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ఆదేశించారు. సోమవారం పీజిఆర్ఎస్ హాలు నందు త్రాగునీరు, జలధార- జల హారతి కార్యక్రమం అమలు, పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జలధార కార్య క్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి విడత జలధార - జల హారతి కార్యక్రమం కింద జిల్లాలో 2,103 పనులను పూర్తి చేసి జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందినట్లు తెలిపారు. ఈ పనుల ప్రగతిని పరిశీలించేందుకు జాతీయ జల మిషన్ బృందం మిత్తూర్, జూపాడు బంగ్లా, నందికొట్కూరు మండలాల్లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. రెండవ విడతలో మంజూరైన జల ధార పనులను కూడా వేగవంతంగా ప్రారంభించి, క్షేత్రస్థాయిలో పనులలో పురోగతిని పెంచాలని కలెక్టర్ ఆదేశించారు.ఆత్మకూరు, నంద్యాల, బండి ఆత్మకూరు, గోస్పాడు, మిత్తూర్ మండలాల్లో ఇంకా జీరో ప్రగతి నమోదు కావడంపై పై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పనులను ప్రారంభించి, ప్రతి పనికి జియో-ట్యాగింగ్ పూర్తి చేసి, ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జలధార -జల హారతి కార్యక్రమం పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి మండలంలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా మందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీటి ఎద్దడి ఏర్పడినప్పుడు సమస్య పరిష్కారానికి గ్రామపం చాయతీ నిధులను వినియోగించాలన్నారు. జలధార--జలహారతి కార్యక్ర మాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేసి, జిల్లాను మెరుగైన పనితీరు కలిగిన జిల్లాల జాబితాలో ముందంజ లో నిలిపేందుకు కృషి చేయాలని తెలిపారు.

## ఎస్సీ పథకాలపై ఏలూరి సమీక్ష

పర్చూరు ఆగస్టు 24వార్త సాక్ష్యం



తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సందర్శి ంచారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, పర్చూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శంకర్‌శెట్టి చిరంజీవి ఎమ్మెల్యేకు పూల మొక్క అందించి స్వాగతం పలికారు.అనంతరం కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, వారికి అందుతున్న ప్రయోజనాలపై ఆయన ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్ ఎమ్మెల్యే ఏలూరికి 'ప్రకాశం డిస్ట్రిక్ట్ గెజిటీర్లు' పుస్తకాన్ని అందజేశారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

# తెలుగుగంగ నీళ్ల కోసం సమరశంఖం





-రైతులతో శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వెలుగోడు ఆగస్టు 24 వార్త సాక్ష్యం

సోమవారం వెలుగోడు పట్టణంలోని షాదీఖానాలో శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రైతులు భారీగా పాల్గొని తమ సాగునీటి సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం, రైతాంగాన్ని, సామాన్య ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాగ్దానాలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ తెలుగుగంగ ఆయకట్టు రైతులకు సాగునీరు అందక పచ్చని పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేక నారుమడులు ఎండిపోతున్నాయని, మరో వారం రోజులు వర్షాలు కురవకపోతే నియోజ కవర్గంలోని రైతులకు కొన్ని కోట్ల రూపాయల మేర తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. బండి ఆత్మకూరు మండలంలోని ఈర్నపాడు, లింగాపురం, పార్నపల్లె గ్రామాల్లో స్వయంగా పర్యటించి రైతుల దీనస్థితిని పరిశీలిం చానని తెలిపారు. పంటలకు సాగునీరు లేకపోవడమే కాకుండా,కనీసం పశువులకు తాగడానికి కూడా నీరు లేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుగంగ కాలువలకు వెంటనే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, మన హక్కైన తెలుగుగంగ జలాలను సాధించుకునే వరకు రైతులతో కలిసి పోరాటం కొనసాగిస్తామని శిల్పా చక్రపాణి రెడ్డి స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోకపోతే, సెప్టెంబర్ 1వ తేదీన 500 ట్రాక్టర్లతో రైతులను తరలించి వెలుగోడు డ్యామ్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.రైతులకు సాగునీరు అందే వరకు వారి పక్షాన నిలబడి అలుపెరగని పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైతులు, మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యం



నంద్యాల మండలం గుంతనాల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

నంద్యాల ఆగస్టు 24 వార్త సాక్ష్యం

ప్రజలకు ఎక్కువ రోగాలు కలుషిత నీటివల్లే వస్తున్నాయని, వాటి నివారణకు, ప్రజల ఆరోగ్యం కోసం ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో నంద్యాల ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం నంద్యాల మండలం గుంతనాల గోస్పాడు మండలం జిల్లెల్ల, పసురపాడు గ్రామ మజరా శ్రీరామ నగర్ గ్రామాలలో నంద్యాల ఎంపీ నిధులతో ఒక్కొక్క మినరల్ వాటర్ ప్లాంట్ కు రూ. 5 లక్షలతో మూడు గ్రామాల్లో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందనీ. ప్రతి గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేం దుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతా మన్నారు. ఈ కార్యక్ర మంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, నంద్యాల ఎంపీడీఓ సుగుణశ్రీ, నంద్యాల రూరల్ తహసీల్దార్ శ్రీవాణి, పసురపాడు టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఆళ్లగడ్డ పుండరీకాక్ష రెడ్డి, ఆళ్లగడ్డ తులశీశ్వరరెడ్డి, గుంతనాల గ్రామ మాజీ సర్పంచ్ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ మళ్లీ పుడితే ఎలా ఉంటుంది...!?



-న్యాయవాది కోడి మోహన్ రావు

దోర్నాల ఆగస్టు 24 వార్త సాక్ష్యం

"అంబేద్కర్ మళ్లీ పుడితే ఎలా ఉంటుంది?" అనే ప్రశ్న వినడానికి ఒక ఊహలా అనిపించినా, దాని వెనుక భారత సమాజాన్ని ఆలోచింపజేసే ఒక గొప్ప ఆవేదన ఉంది. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేడు మన మధ్య ఉంటే, ఈ దేశాన్ని ఆయన ఎలా చూసేవారు? మన సమాజంలో జరుగుతున్న పరిణామాలపై ఎలా స్పందించేవారు? అనే ప్రశ్న ప్రతి పౌరుడూ వేసుకోవాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ మళ్లీ పుడితే మొదటగా మన రాజ్యాంగాన్ని చేతిలోకి తీసుకుని, "నేను కలలుగన్న భారతదేశం ఇదేనా?" అని ప్రశ్నించేవారేమో. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించినప్పటికీ, సమాజంలో ఇంకా కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలు కొనసాగుతున్న పరిస్థితిని చూసి ఆయన ఆవేదన చెందేవారు. అంబేద్కర్ మళ్లీ పుడితే కేవలం పూల మాలలు, జయంతి వేడుకలు, విగ్రహాల ఆవిష్కరణలతో ఆయనను స్మరించడాన్ని అంగీకరిం చేవారు కాదు. "నా విగ్రహాన్ని ఎంత ఎత్తుగా పెట్టార న్నది కాదు; నేను చెప్పిన విద్య, సంఘటితం, పోరాటం అనే మార్గంలో మీరు ఎంత దూరం నడిచారన్నదే ముఖ్యం" అని సమాజాన్ని నిలదీసేవారు. ఈ రోజుల్లో అంబేద్కర్ పేరు ప్రతి రాజకీయ పార్టీకి అవసరమైంది. ఆయన చిత్రపటం ప్రతి సభలో కనిపిస్తోంది. కానీ ఆయన ఆలోచనలు, ఆయన రచనలు, ఆయన రాజ్యాంగ దృక్పథం ఎంతమంది చదువుతున్నారు? ఆయన కోరుకున్న సామాజిక ప్రజాస్వామ్యం కోసం ఎంతమంది పనిచేస్తున్నారు? అన్నది అసలు ప్రశ్న. అంబేద్కర్ మళ్లీ పుడితే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. పేద పిల్లలు, అణగారిన వర్గాల పిల్లలు నాణ్యమైన విద్యకు దూరం కాకుండా చూడాలని పోరాడేవారు. ఎందుకంటే విద్య మనిషికి కేవలం ఉద్యోగం మాత్రమే ఇవ్వదు; ప్రశ్నించే శక్తిని, ఆలోచించే సామర్థ్యాన్ని, తన హక్కులను తెలుసుకునే ధైర్యాన్ని ఇస్తుందని ఆయన జీవితం మనకు చెబుతుంది. అంబేద్కర్ మళ్లీ పుడితే యువతను చూసి ఒక ముఖ్యమైన ప్రశ్న అడిగేవారు---"మీ చేతిలో ఉన్న మొబైల్‌లో ప్రపంచాన్ని చూస్తున్నారు; కానీ మీ చేతిలో ఉండాల్సిన పుస్తకం ఎక్కడ?" అని. కులం, మతం, ప్రాంతం, వ్యక్తిపూ జలకంటే జ్ఞానం, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం వైపు యువతను నడిపించేందుకు ప్రయత్ని ంచేవారు. అంబేద్కర్ మళ్లీ పుడితే రాజకీయాల్లో కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తేవారు. అధికారంలోకి రావడం మాత్రమే రాజకీయం కాదని, అధికారాన్ని ఉపయోగించి బలహీన వర్గాలకు న్యాయం చేయడమే నిజమైన ప్రజాస్వామ్య రాజకీయమని గుర్తుచేసేవారు. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు తన ఓటును ఆలోచించి వినియోగించాలని పిలుపునిచ్చేవారు. మహిళల స్థితిగతులను చూసి కూడా ఆయన మౌనంగా ఉండేవారు కాదు. మహిళలకు సమాన హక్కులు, విద్య, ఆస్తి హక్కు, ఆర్థిక స్వావలంబన, గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు మరింత బలంగా పోరాడేవారు.

-అంబేద్కర్ మళ్లీ పుట్టాల్సిన అవసరం నిజంగా ఉందా..?

ఎందుకంటే అంబేద్కర్ ఒక వ్యక్తి మాత్రమే కాదు---ఒక ఆలోచనా విధానం. ఒక ఉద్యమం. ఒక సామాజిక మార్పు దిశ. ఆయన మళ్లీ పుట్టాలని ఎదురు చూడటం కంటే, మనలో ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆలోచనలను చదివి, అర్థం చేసుకుని, ఆచరణలో పెట్టడం ముఖ్యం.అంబేద్కర్ మళ్లీ పుడితే మనం ఆయనను దేవుడిగా పూజించాల్సిన అవసరం లేదు. ఆయనను చదవాలి. ప్రశ్నించాలి. అర్థం చేసుకోవాలి. ఆచరించాలి.అంబేద్కర్‌కు నిజమైన నివాళి ఆయన విగ్రహానికి పూలమాల వేయడం కాదు; ఒక పేద పిల్లవాడికి విద్య అందించడం. కుల వివక్షకు వ్యతిరేకంగా నిలబడటం. రాజ్యాంగాన్ని గౌరవించడం. మహిళను సమానంగా చూడటం. బలహీనుడి హక్కు కోసం గొంతెత్తడం. మనలోని వివక్షను తొలగించుకోవడం.అంబేద్కర్ మళ్లీ పుడితే భారతదేశం మారుతుందని ఎదురు చూడకండి. అంబేద్కర్ ఆలోచనల్లో మనమే పుడితే---భారతదేశం తప్పకుండా మారుతుంది.అదే నిజమైన అంబేద్కర్ పునర్జన్మ.అదే రాజ్యాంగానికి నిజమైన గౌరవం.అదే సమానత్వ భారతదేశానికి మార్గం



VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/29/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 25 ఆగష్టు 2026

## అభివృద్ధి పనులతోపాటు విద్యకు ప్రాధాన్యం

**-ఎమ్మెల్యే రామాంజనేయులు**



ప్రత్తిపాడు, ఆగస్టు 24వార్త సాక్ష్యం:

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు తెలిపారు. పెదనందిపాడు మండలం పాలపర్రు, అన్నపర్రు గ్రామాల్లో సోమవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలపర్రు గ్రామంలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం--సంక్షేమ విజయాలు, ప్రజా పాలన--ఇంటింటికీ అభివృద్ధి' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాల ద్వారా వివిధ వర్గాలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామస్థులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అన్నపర్రు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ప్రహరీ తదితర వసతులను పరిశీలించి ఉపాధ్యాయులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకులని, వారి విద్యాభివృద్ధికి వేసే ప్రతి అడుగు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అంకారావుకు బెయిల్

**-కూటమి ప్రభుత్వ కుట్రలకు న్యాయస్థానంలో చెక్!**

పల్నాడుఆగస్టు 24వార్త సాక్ష్యం:



వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి భీమిని అంకారావుకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంపై ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది ఎంఎన్ ప్రసాద్ స్పందిం చారు. అంకారావును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపాలన్న కూటమి ప్రభుత్వం, పోలీసుల ప్రయత్నాలకు కోర్టు తీర్పుతో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. దొంగతనం, కత్తితో దాడికి వచ్చాడంటూ తీవ్రమైన ఆరోపణలతో కేసులు నమోదు చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రాజకీయంగా ఎదుగు తున్న యువ నాయకులను తప్పుడు కేసులతో భయపెట్టి వెనక్కి తగ్గించాలని చూస్తే ప్రజలు, న్యాయవ్యవస్థ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టి వారి గొంతు నొక్కడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. 'వైఎస్సార్‌సీపీని గొడ్డలి పార్టీ అని విమర్శిస్తే ఓకే.. టీడీపీని వెన్నుపోటు పార్టీ అంటే కేసులా?' అని ఎంఎన్ ప్రసాద్ ప్రశ్నించారు. అంకారావుకు బెయిల్ రావడం న్యాయం గెలిచినట్లేనని, అక్రమ కేసులు, రాజకీయ వేధింపులకు న్యాయస్థానాలే సరైన సమాధానం చెబుతున్నాయని అన్నారు.

## నంద్యాల జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి

**-మహాత్మ జ్యోతిరావు పూలేబాలుర రెసిడెన్షియల్ 5, 6వ తరగతుల అడ్మిషన్లపై సమగ్రమైన విచారణ చేపట్టాలి**

**-రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం నంద్యాల జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి**

నంద్యాల ఆగస్టు 24వార్త సాక్ష్యం



నంద్యాల జిల్లాలోని సున్నిపెంట, శ్రీశైలం, ప్రాజెక్టు పరిధిలోని మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌లో 5, 6వ తరగతుల అడ్మిషన్లలో అక్రమాలు, విద్యార్థుల డైట్ నిధుల వినియోగంలో అవకతవకలు, భోజనం, కూరగాయలు, గుడ్లు తదితర సరుకుల కొనుగోలులో అక్రమాల ఆరోపణలు మరియు సిబ్బంది నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సింది గా,–
ంవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం

**-నంద్యాల జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి**

డిమాండ్ చేశారు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో ఆర్డీవో రాము నాయక్ ప్రజా సమస్య వేదిక లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నిపెంటలోని మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్/వసతి గృహంలో విద్యార్థుల అడ్మిషన్లు, డైట్ నిర్వహణ, భోజన నాణ్యత మరియు సిబ్బంది పర్యవేక్షణకు సంబంధించి కొన్ని తీవ్రమైన ఆరోప ణలు మరియు అనుమానాలు మా దృష్టికి వచ్చాయి. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని క్రింది అంశాలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించవలసిందిగా కోరుతున్నాను. 5 మరియు 6వ తరగతుల అడ్మిషన్లపై విచారణ ప్రస్తుత విద్యాసంవత్సరంలో 5, 6వ తరగతుల ప్రవేశాల్లో మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు మరియు అధికారిక ఎంపిక ప్రక్రియ పాటించారా లేదా అనే అంశంపై విచారణ జరిపించాలి. ఎంపికైన విద్యార్థుల మెరిట్ జాబితా, రిజర్వేషన్ కేటగిరీ, దరఖాస్తుల సంఖ్య, ఎంపికైన విద్యార్థుల జాబితా మరియు అడ్మిషన్ రికార్డులను పరిశీలించాలి. విద్యార్థుల డైట్ నిధులు మరియు ఆహార సరుకులపై విచారణ:వసతి గృహం లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం కేటాయించిన డైట్ నిధులు పూర్తిగా మరియు నిబంధనల ప్రకారం వినియోగించారా లేదా పరిశీలి ంచాలి. ముఖ్యంగా గుడ్లు, కూరగాయలు, బియ్యం, పప్పులు, నూనె మరియు ఇతర నిత్యావసర సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన బిల్లులు, వౌచర్లు, స్టాక్ రిజిస్టర్లు, సరఫరా రికార్డులు మరియు చెల్లింపులను తనిఖీ చేయాలి.విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతపై తనిఖీ విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెనూ అమలు చేస్తున్నారా, నిర్ణీత పరిమాణంలో ఆహారం అందిస్తున్నారా, గుడ్లు మరియు కూరగాయలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశాలపై అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించాలి. అవసరమైతే ఆహార పదార్థాల నాణ్యతను కూడా పరీక్షించాలి.రికార్డులు మరియు బిల్లుల పరిశీలన: డైట్‌కు సంబంధించిన బిల్లులు, వౌచర్లు, స్టాక్ రిజిస్టర్లు, హాజరు రిజిస్టర్లు, మెనూ రిజిస్టర్లు, కొనుగోలు రికార్డులు, బ్యాంక్/చెల్లింపు వివరాలు మరియు సంబంధిత ఇతర రికార్డులను స్వాధీనం చేసుకుని/పరిశీలించి, వాస్తవ విద్యార్థుల సంఖ్యతో సరిపోల్చి చూడాలి.వార్డెన్ మరియు సంబంధిత సిబ్బంది బాధ్యతపై విచారణ చేపట్టి వార్డెన్, అసిస్టెంట్ వార్డెన్/సంబంధిత సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించారా లేదా అనే అంశంపై విచారణ జరిపించాలి. నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

**-విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ:**

విచారణ సమయంలో విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేదా ప్రతీకార చర్యలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల నుంచి స్వతంత్రంగా సమాచారం సేకరించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలి. అధికారులను విజ్ఞప్తి చేశారు.పై అంశాలన్నింటిపై జిల్లా స్థాయి స్వతంత్ర విచారణ కమిటీని ఏర్పాటు చేసి, ఆకస్మిక తనిఖీ నిర్వహించి, సంబంధిత రికార్డులు మరియు బిల్లులను పూర్తిగా పరిశీలించి, విద్యార్థులు/తల్లిదండ్రుల వాంగ్మూలాలను నమోదు చేసి, ఆరోపణలు వాస్తవమని విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.అలాగే విచారణ నివేదికను ప్రజలకు/ఫిర్యాదుదారునికి నిబంధనల మేరకు తెలియజేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి మరియు భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం రూపంలో అధికారులను కోరారు

## వేంపెంట గ్రామంలో ఇంటింటికి కూటమి సంక్షేమ పథకాలు





**-రెండేళ్ల పాలన కార్యక్రమంలో ప నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త.జయసూర్య**

పాములపాడు ఆగస్టు 24 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని,వేంపెంట గ్రామంలో "రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి--సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి , కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త.జయసూర్య ప్రభుత్వ అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి తెలుపుతూ, కరపత్రాలు ఇచ్చి, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు సోమవారం గ్రామంలోప్రజల సమస్యలను తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గిత్త. జయ సూర్య తెలిపారు గ్రామ ప్రజలకు భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో టిడిపి నియోజవర్గ అబ్జర్వర్ వెంకటశివుడు యాదవ్, మండల కన్వీనర్ జి. రవీంద్రారెడ్డి, వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి. రామసుబ్బమ్మ, సొసైటీల చైర్మన్లు లక్ష్మీకాంతరెడ్డి, వాడాల జనార్ధన్ రెడ్డి, టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడ్, మాజీ సర్పంచ్ వై.మాణిక్యమ్మ, నాయకులు చెల్లె. హరినాథ రెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు, టిడిపి కల్చరల్ మండల అధ్యక్షుడు భావన వినోద్ కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం బాషా, రుద్రవరం రాచపుడి.సురేష్, జూటూరు నాయిని మధు, తహసిల్దార్ జి.సుభద్రమ్మ, ఇన్చార్జి ఎంపీడీవో ఉ ఈఓఆర్డి సులోచన, విబిజి రాంజీ ఏపీవో బి.జయంతి, జెఈ- సువర్చల, ఆర్ఐ డి. ఖాజాబీ, అగ్రికల్చర్ ఏవో ఎం.వెంకట మహేశ్వర్ రెడ్డి, ఐకెపి ఏపిఎం-ఏ.ఉమామహేశ్వరి, ఏఎస్ఐ జోసెఫ్, ఐసిడిఎస్ సూపర్వైజర్, వేంపెంట టీడీపీ గ్రామ నాయకులు ఎంపీటీసీ బోనాల నాగలక్ష్మమ్మ, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ (డీసీ)ఆల్ఫ్రెడ్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, బీసీ సెల్ మండల సెక్రటరీ మల్లికార్జున నాయుడు, మాజీ ఉప సర్పంచ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, యువరాజు, నెంబర్ లక్ష్మన్న, చిన్న స్వామి ఆచారి, వేమా రెడ్డి, జనసేన శేషు, సోమాని నాయక్, బోనాల భాస్కర్, రత్నాకర్, నారాయణ, గోకారి, నులక చంద్ర, శేషురెడ్డి, బాబు రావు, హరికృష్ణ నాయక్, సుబ్బారావు, ఎర్రసాని రాము, తాటిపాటి నాయుడు, శ్యామా రాజు, శ్రీధర్, నాగరాజు, జీవన్న,ప్రసాద్, నాగేశ్వర్ నాయక్, బాలాజీ, సుబ్బారాయుడు, శీలం శ్రీనివాసులు, సురేష్, జయన్న, మొగిలి శ్రీను, పెద్ద రాజయ్య, రామయ్య, ఆదిరెడ్డి, లెనిన్ బాబు, బాలస్వామి, చంద్రశేఖర్ గౌడ్, శంకరాములు నాయక్, సోముల నాయక్, ఇస్కాల ఏర్వ.నాగలక్ష్మి రెడ్డి, లింగస్వామి, చెలిమిల్ల మాజీ సర్పంచ్ ఆది నారాయణ, లింగాల మాజీ సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, పగిడ్యాల మండల కన్వీనర్ పలచాని మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఎ రవీంద్ర, సోషల్ మీడియా ప్రతినిధి ప్రవీణ్, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత ఎన్నికలకు పోలీసుల దిశానిర్దేశం

కర్లపాలెం ఆగస్టు 24వార్త సాక్ష్యం




ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరి ంచాలని కర్లపాలెం ఎస్సై రవీంద్ర సూచించారు. కర్లపాలెం మండలం లోని యెట్రవారిపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో గ్రామ పెద్దలు, ప్రజలకు ఎన్నికల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై పోలీసుల తరఫున దిశానిర్దేశం చేశారు.ఎన్నికల సమయంలో రాజకీయ విభేదాలు వ్యక్తిగత ఘర్షణలకు దారితీయకుండా సంయమనం పాటించాలని, గ్రామంలో ఐకమత్యం, సోదరభావంతో మెలగాలని ఎస్సై సూచించారు. చిన్నపాటి వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా పరస్పరం సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరగాళ్ల మోసాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయరాదని, వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియజేయవద్దని అవగాహన కల్పించారు.గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు దూరంగా ఉండాలని, అనుమా నాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారని, ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజల భద్రతకు పోలీసుల సూచనలు

పిట్టలవానిపాలెంఆగస్టు 24వార్త సాక్ష్యం



ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలను నియంత్రించడంతో పాటు గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పవచ్చని చందోలు ఎస్ఐ కె. మాధవరావు అన్నారు. బాపట్ల జిల్లా పిట్టల వానిపాలెంలో నిర్వహించిన పోలీసుల అవగాహన సదస్సులో స్థానిక సమస్యలు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఎస్ఐ తెలిపారు. ఎలాంటి వివాదాలు, ఘర్షణలకు తావివ్వ కుండా ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియో గం యువత భవిష్యత్తును దెబ్బతీ స్తుందని, గంజాయికి పూర్తిగా దూరంగా ఉండాలని హెచ్చరిం చారు. గ్రామంలో గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ద్విచక్ర వాహనదా రులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, 'శిరోరక్షే ప్రాణరక్ష' అనే విషయాన్ని గుర్తుంచు కోవాలని సూచించారు. హెల్మెట్ కేవలం నిబంధన కాదని, కుటుంబానికి భరోసా ఇచ్చే రక్షణ కవచమని పేర్కొన్నారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించేందుకు సంకోచించవద్దని తెలిపారు. మహిళలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్‌కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, బ్యాంకు ఖాతా, ఓటీపీ, వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరిం చారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎస్ఐ తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, వీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా పెంచవచ్చుని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# 'అర్చన 31 నాటౌట్' (ఈటీవీ విన్) రివ్యూ!

ఐశ్వర్య లక్ష్మీ ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే 'అర్చన 31 నాటౌట్'.కామెడీ డ్రామా జోనర్లో నిర్మితమైన సినిమా ఇది. మార్టిన్ ప్రకట్ నిర్మించిన ఈ సినిమాకి, అఖిల్ అనిల్ కుమార్ దర్శకత్వం వహించాడు. మలయాళంలో రూపొందిన ఈ సినిమా, 2022లోనే థియేటర్లకు వచ్చింది. అలాంటి ఈ సినిమా రీసెంటుగా 'ఈటీవీ విన్'లో స్ట్రీమింగ్ కి వచ్చింది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం.అర్చన (ఐశ్వర్య లక్ష్మి) ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చెందిన యువతి. ఆమె ఒక స్కూల్ లో టీచర్ గా పనిచేస్తూ ఉంటుంది. కుటుంబ బరువు బాధ్యతలను ఆమెనే నిర్వహిస్తూ ఉంటుంది. స్కూల్ లో ఆమె పరిస్థితి కష్టంగా ఉంటుంది. ఆ స్కూల్ లో టీచర్లను తొలగించే ప్రక్రియ ఒకటి ప్రారంభమవుతుంది. ఆ జాబితాలో ఆమె పేరు ఉంటుంది. దాంతో జాబ్ పోతే తన పరిస్థితి ఏమిటనే ఒక ఆందోళన ఆమెకి నిద్రలేకుండా చేస్తుంటుంది.అదే సమయంలో ఆమెకి వరుసగా పెళ్లి సంబంధాలు వస్తుంటాయి. అయితే అనేక కారణాల వలన ఆ సంబంధాలు తప్పిపోతూ ఉంటాయి. అలాంటి పరిస్థితులలో ఆమెకి ఒక సంబంధం కుదురుతుంది. ప్రసాద్ తో ఆమె పెళ్లికి ముహూర్తం ఖాయమవుతుంది. ఇకపై జాబ్ లేకపోయినా ఫరవాలేదనే ఒక సంతోషంతో ఆమె ఉంటుంది. నిదానంగా తన చదువును పూర్తిచేయవచ్చని భావిస్తుంది. 'వేణు' అనే ఒక యువకుడు ఆమెను మౌనంగా ఆరాధిస్తూ ఉంటాడు. తన మనసులోని ప్రేమను ఆమెకి చెప్పలేకపోతాడు. ఈ నేపథ్యంలో పెళ్లిరోజు రానే వస్తుంది. అర్చన ఇల్లంతా బంధువులతో సందడిగా ఉంటుంది. అదే సమయంలో అర్చనకి ఒక చేదు నిజం తెలుస్తుంది. ప్రసాద్ తాను ఇష్టపడుతున్న అమ్మాయితో కలిసి ఊరొదిలి వెళ్లిపోయాడనేది దాని సారాంశం. తన పెళ్లి చేసి ఊపిరి పీల్చుకుందామని భావించిన తల్లిదండ్రులకు ఏం చెప్పాలో తెలియక అర్చన నివ్వెరపోతుంది. ఆ తరువాత ఆమె ఏం చేస్తుంది? ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనేది కథ.జాబ్ చేస్తూ తన తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలనేది అర్చన ఆలోచన. సాధ్యమైనంత త్వరగా ఆమె వివాహం చేసి పంపించాలనేది తల్లిదండ్రుల ఆత్రుత. అయితే ఇలాంటి పరిస్థితులలో ఒక వైపున ఆమె కెరియర్ .. మరో వైపున ఆమె వివాహం రెండూ కూడా ప్రశ్నార్థకంగా మారతాయి. ఆ పరిస్థితులను ఆమె ఎలా ఎదుర్కొంటుంది? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను తిప్పుతూ వెళ్లాడు.అర్చన ఉద్యోగ జీవితంలోని ఒడిదుడుకులు .. పెళ్లి సంబంధాల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులతో ఫస్టాఫ్ నడుస్తుంది. ఇక ఈ రెండు సమస్యలకు ఒక పరిష్కార మార్గం దొరికింది అనుకుంటూ ఉండగానే ఆమె జీవితం మరింత చిక్కుల్లో పడుతుంది. అందుకు సంబంధించిన సన్నివేశాలతో సెకండాఫ్ కొనసాగుతుంది.ఈ కథ మొదలైన దగ్గర నుంచి ఇక పుంజుకుంటుందేమో అనే ఒక ఆలోచనతో ఆడియన్స్ ఎదురు చూస్తుంటారు. అయితే కథలోగానీ .. కదలికలో గాని ఎలాంటి మార్పు ఉండదు. సాధారణంగా ఈ తరహా మలయాళ సినిమాలలో, చివరిలో ఏదో ట్విస్ట్ ఉంటుంది. అలాంటి ఒక ట్విస్ట్ ఏం ఉంటుందా? అని ఎదురుచూసిన ప్రేక్షకులకు నిరాశే మిగులుతుంది. చివర్లో ఏదో ఒక అద్భుతం జరగకపోగా, కథను అంతే బలహీనంగా వదిలేసి వెళ్లిపోతుంది.సాధారణంగా పెళ్లికి వచ్చిన పెద్దలు అక్షతలు వేసి ఆశీర్వదించి .. భోజనాలు చేసి వెళుతుంటారు. ఒకవేళ పెళ్లి ఆగిపోయినా యువతులు కుమిలిపోతూ కూర్చోవలసిన అవసరం లేదు. పెద్దలు డీలాపడిపోయి వెనుదిరగవలసిన అవసరం లేదు. సందడిని కొనసాగించి .. ఆ తరువాత ఆ యువతీ తన భవిష్యత్తుపై ఫోకస్ చేయవచ్చు అనే ఒక చిన్నపాటి సందేశం ఈ కథలో కనిపిస్తుంది. కాకపోతే అది బలంగా నాటుకోవడానికి అవసరమైన సన్నివేశాలు పడలేదు. పల్లె వాతావరణం .. అక్కడ పెళ్లి జరిగే తంతు .. తాగుబోతుల హడావిడి .. ఒకే కలర్ శారీస్ కట్టుకోవాలనే మహిళల ఆలోచన .. మ్యూజికల్ నైట్స్ .. ఈ తరహా వాతావరణం సెట్ చేయడంలో కొంతవరకూ సక్సెస్ అయ్యారు. కాకపోతే కథలో బలం లేని కారణంగా అవి కనెక్ట్ కాలేకపోయాయి.




పాత్రల పరంగా చెప్పుకోవడానికిగానీ, నటన పరంగా చెప్పుకోవలసిన పరిస్థితిగాని మనకి ఎక్కడా కనిపించదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం ..ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయంతే. కేవలం ఐశ్వర్య లక్ష్మి పాత్ర చుట్టూ మాత్రమే వేసుకున్న సింపుల్ లైన్ ఇది. ప్రేక్షకులను ఏ మాత్రం ప్రభావితం చేయలేని కంటెంట్ గానే ఇది కనిపిస్తుంది.

## ఓ ఇంటివాడైన టాలీవుడ్ నటుడు ప్రిన్స్

# న్యూజిలాండ్ లో ఘనంగా వివాహం



టాలీవుడ్ యంగ్ హీరో ప్రిన్స్ సెసిల్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రియురాలు సాయి ప్రతిమ మెడలో మూడు ముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. న్యూజిలాండ్‌లోని వనాకా ప్రాంతంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. వివాహ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మహారాణిలా మెరిసిపోగా, వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించాడు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నూతన జంటకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు. వీరిద్దరి ప్రేమకథ కూడా ఎంతో ఆసక్తికరంగా మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ వివాహ వేడుకలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, ఆపై ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు చేరింది. 'నీకు నాకు డ్యాష్ డ్యాష్' చిత్రంతో హీరోగా పరిచయమైన ప్రిన్స్, 'బస్ స్టాప్' సినిమాతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'బిగ్ బాస్ తెలుగు' మొదటి సీజన్‌లో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఇటీవల 'డీజే టిల్లు', 'స్కంద' వంటి విజయవంతమైన చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ నటుడిగా తనను తాను నిరూపించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రిన్స్ మరికొన్ని ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.

## ఆత్మకథగా రజనీకాంత్ ప్రస్థానం..
## అధికారికంగా ప్రకటించిన కుమార్తె సౌందర్య

సూపర్‌స్టార్ రజనీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని, జీవిత అనుభవాలను పుస్తక రూపంలో అభిమానులకు అందించబోతున్నారని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య రజనీకాంత్ వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె... ఆ పుస్తకం తయారీ ప్రాసెస్ చాలా ప్రత్యేకంగా సాగుతోందని తెలిపారు.రజనీకాంత్ ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలోని విజయాలు, వ్యక్తిగత అనుభవాలు, అగ్రస్థానానికి చేరుకునే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లతో ఈ పుస్తకం రూపుదిద్దుకుంటోంది. పరమహంస యోగానంద రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకంలాగే ఈ పుస్తకం కూడా తరతరాలకు స్ఫూర్తినిస్తుందని సౌందర్య నమ్మకం వ్యక్తం చేశారు.ఒకవేళ తన తండ్రి జీవితాన్ని సినిమాగా తెరకెక్కించే అవకాశం వస్తే అది తనకు అత్యంత ప్రత్యేకమైన విషయమని ఆమె తెలిపారు. సృజనాత్మకతకు స్పష్టత, క్రమశిక్షణ చాలా ముఖ్యమని తన తండ్రి నేర్పించారని పేర్కొన్నారు.ప్రస్తుతం సౌందర్య నిర్మాణంలో నెట్‌ఫ్లిక్స్ కోసం 'లవ్' అనే రొమాంటిక్ తమిళ వెబ్‌సిరీస్ రూపొందుతోంది. బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రలు పోషిస్తుండగా... ఇది అక్టోబరులో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.